sahanamvande.com epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 29-07-2025 మంగళవారం | సంపుటి-1 సంచిక : 130 EDITOR: ROHINI

### హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జిలు

తెలంగాణ హైకోర్టులో నలుగురు కొత్త న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు కోలీజియం చేసిన సిఫారసులను కేంద్రం ఆమోదించగా, రాష్ట్రపతి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు జడ్జిలుగా గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్‌లు ప్రమాణం చేయనున్నారు. - సహనం వందే, న్యూఢిల్లీ

### ఏపీ లిక్కర్ కేసులో 12మందిపై వారెంట్


ఏపీ లిక్కర్ స్కాంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న 12 మంది నిందితులు దేశం విడిచిపారిపోయారు. దీంతో ప్రత్యేక విచారణ బృందం(సిట్) రెడ్ కార్నర్ నోటీసులు జారీకి సన్నద్ధమవుతుండగా, ఏసీబీ ప్రత్యేక కోర్టు వారిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. విచారణకు హాజరుకాలేదనే కారణంతో వారెంట్లు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. - సహనం వందే, అమరావతి



# సృష్టి వైద్యాధికారులపై చర్యలు?

## తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ సన్నాహాలు

MEDICAL AND HEALTH OFFICIALS IN NEGLIGENCE ON FERTILITY CENTRES IN HYDERABAD




'సృష్టి' ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారంపై తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్ అయ్యారు. ఆ వ్యవహారం వెనక ఉన్న అధికారులు ఎవరో తెలుసుకోవాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులైన వైద్యాధికారులకు నోటీసులు ఇవ్వాలని ఆయన ఆదేశించినట్లు తెలిసింది. ఈ విషయంపై మంత్రి దామోదర రాజనర్సింహ 'సహనం వందే' ప్రతినిధితో మాట్లాడుతూ... సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని స్పష్టం చేశారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తున్నట్లు వెల్లడించారు. అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపుతున్న ఈ విషయంపై మానవ హక్కుల కమిషన్ విచారణ చేపట్టింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. సంతానం లేని దంపతులకు ఐవీఎఫ్, సరోగసీతో పిల్లల్లేని కొరత తీర్చుతామంటూ శిశు విక్రయాలు సాగిస్తున్న సికింద్రాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రంపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

- సహనం వందే, హైదరాబాద్

- సమగ్ర నివేదిక ఇవ్వాలని దామోదర ఆదేశం
- అసలు హైదరాబాదులో ఏం జరుగుతుంది?
- అధికారులు ఏంచేస్తున్నారని మంత్రి సీరియస్
- సృష్టి వెనక ఉన్న యంత్రాంగంపై విచారణ
- ఇది సాధారణ కేసు కాదని స్పష్టీకరణ
- పిల్లలని ఎత్తుకొచ్చి అమ్మడం దారుణం

### తప్పించుకుంటున్న వైద్యాధికారులు...

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 200 వరకు ఫెర్టిలిటీ సెంటర్లు ఉన్నాయి. కొన్ని సెంటర్లు నిబంధనల మేరకు పనిచేస్తుండగా... అనేక సెంటర్లు నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్టు విచారణలో వెలుగుచూసింది. జిల్లా వైద్యాధికారుల చేతుల్లోనే పర్యవేక్షణ ఉంటుందని మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. జిల్లా వైద్యాధికారులు వీటిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఆయన పేర్కొన్నారు. లైసెన్సు రద్దు చేసినప్పటికీ, అది అక్రమంగా పనిచేస్తున్నప్పుడు బాధ్యత ఎవరిదని ఆయన నిలదీశారు. కాగా... ఫెర్టిలిటీ సెంటర్ పై వచ్చిన ఆరోపణ నేపథ్యంలో సంబంధిత వైద్యాధికారులు తప్పించుకుంటున్నారు. తమకు ఏమాత్రం సంబంధం లేదని వాదిస్తున్నారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పెద్ద ఎత్తున ప్రకటనలు ఇచ్చి, టీవీలలో స్లాట్ లు బుక్ చేసుకుంటూ ప్రచారం చేస్తూ దందా చేస్తున్నప్పుడు వైద్యాధికారులకు బాధ్యత లేదా? అనేక ఫెర్టిలిటీ సెంటర్ల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు కూడా వస్తున్నాయి. కానీ వాటికి ఆధారం లేదంటూ రివర్స్ మాట్లాడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడైనా అవినీతికి ఆధారాలు ఉంటాయా? రసీదులు ఇచ్చి ముడుపులు పుచ్చుకుంటారా? కొందరు వైద్యాధికారుల వాదన చూస్తుంటే తప్పుచేసి... దాన్ని ఎత్తి చూపిన వాళ్ల మీద ఎదురు దాడి చేస్తున్నారు. ఒక్కొక్కరి బండారం ఏంటో కొందరు వైద్యాధికారులే చెప్తున్నారు. హైదరాబాదులో ఇంత జరుగుతుంటే బాధ్యత ఎవరు వహించాలి? వైద్యాధికారులు కాకుండా విద్యాశాఖ వాళ్ళు తీసుకుంటారా?

### 'సృష్టి'లో 200 మంది రిజిస్ట్రేషన్...

సృష్టి హాస్పిటల్ వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ హాస్పిటల్‌లో 200 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన 200 ఫైల్స్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో దంపతులకు వివిధ పద్ధతుల్లో డాక్టర్ నమ్రత పిల్లలను ఇచ్చారు. పిల్లల్ని పొందిన దంపతుల వివరాలను గోపాలపురం పోలీసులు సేకరిస్తున్నారు. సృష్టి వ్యవహారం బయటికి రావడంతో దంపతులు ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశారు. ఈ విషయంలో తమకు తలనొప్పులు ఎందుకని వాళ్ళు భావిస్తున్నారు. కాగా కూకట్‌పల్లి, కొండాపూర్‌లోనూ సృష్టి బ్రాంచ్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# ఢిల్లీతో రేవంత్ రెడ్డీ

## బీసీ రిజర్వేషన్లపై కేంద్రంతోనే కొట్లాట

### 5, 6, 7 తేదీల్లో ఢిల్లీ వీధుల్లో బీసీ నినాదం

### తరలిరావాలని క్యాబినెట్ పిలుపు



తెలంగాణలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుదలగా ఉంది. స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఢిల్లీ వీధుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, ఇతర పార్టీల నేతలతో కలిసి రాష్ట్రపతిని కలవనున్నారు. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న రెండు బిల్లులను ఆమోదించాలని కోరనున్నారు. ఈ సందర్భంగా బీసీలంతా ఢిల్లీకి తరలిరావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

- సహనం వందే, హైదరాబాద్



### కేబినెట్ కీలక నిర్ణయాలు

మంగళవారం జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలో 25 అంశాలపై చర్చించారు. వీటిలో బీసీ రిజర్వేషన్ల అంశం కీలకంగా మారింది. ఆగస్టు మొదటి వారంలో ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి వెళ్లి ఆరో తేదీన ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరితో కలిసి మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ రిజర్వేషన్లపై తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని వివరించారు.

### గత ప్రభుత్వంపై విమర్శలు

గతంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు ఉన్నాయని, మాజీ ముఖ్యమంత్రి నాయకత్వంలోని ఫ్యూడలిస్ట్ పార్టీ 2018 చట్టం ప్రకారం 50 శాతం లోపల రిజర్వేషన్లు అని తెచ్చి దానిని తగ్గించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఈ నెల 7న ఆర్డినెన్స్ జారీ చేశామని, 14న గవర్నర్‌కు పంపించామని తెలిపారు. 2018 పంచాయతీ రాజ్ చట్టంలో ఉన్న 50 శాతం నిబంధనను ఎత్తివేస్తూ, ఇప్పటికే 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ తాము చట్టం చేశామని, దానిని ఆమోదించి రాష్ట్రపతికి పంపాలని గవర్నర్‌ను విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. గవర్నర్ నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు.

### బీజేపీపై ప్రశ్నల వర్షం

కేంద్రం జోక్యం చేసుకొని రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లులను ఆమోదింపజేయాలని పొన్నం ప్రభాకర్ కోరారు. భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని బండి సంజయ్, ఈటల రాజేందర్, ఆర్.కృష్ణయ్య, లక్ష్మణ్, అరవింద్ వంటి ఐదుగురు బీసీ ఎంపీలు ఉన్నారని, రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లులను ఆమోదింపజేయాలని వారిని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు దీనికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ బీసీ నాయకత్వం ఈ అంశాన్ని ఖండించి బలహీన వర్గాలకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కేశవరావు, తాను, వాకిటి శ్రీహరి, మహేష్ గౌడ్ సహా బలహీన వర్గాల శాసనసభ్యులు, ఎంపీలు అందరూ కలిసి ఈ అంశంపై విజ్ఞప్తి చేసినట్లు గుర్తుచేశారు.

### 'తెలంగాణ ఉద్యమంలా పోరాడాలి'

తెలంగాణ ఉద్యమంలా స్ఫూర్తిదాయకంగా బలహీన వర్గాలకు అవకాశం వస్తుందని, 90 శాతం పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శాసనసభలో నిజాయితీగా బిల్లులకు మద్దతు తెలిపారని, ఇప్పుడు ఈ బిల్లుకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కడుపులో కత్తులు పెట్టుకొని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అయినా ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కేబినెట్‌లో కూడా ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు.

### ఢిల్లీకి తరలిరండి!

ఆగస్టు 5, 6, 7 మూడు రోజుల పాటు ముఖ్యమంత్రి, పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ అడుగుతున్నారని మంత్రి తెలిపారు. దేశంలో ఉన్న కాంగ్రెస్ మిత్రపక్షాలతో పాటు వంద మందికి పైగా ఎంపీలు, రాజ్యసభ సభ్యులతో సహా తెలంగాణలోని ప్రతి శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎంపీలు, మంత్రులు ఢిల్లీ వెళుతున్నారని చెప్పారు. తెలంగాణలోని బీసీ మేధావులు, నాయకులు, కుల సంఘాలు, తెలంగాణ ఉద్యమం కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఏ విధంగా పోరాడారో, ఈ కీలకమైన దశలో కూడా అలాగే పోరాడాలని పిలుపునిచ్చారు.

# విత్తన దందా...

# అధికారుల అండ

## అధిక ధరలతో అన్నదాత లూటీ

### నిషేధిత బీటీ విత్తనాల విక్రయం

### రాష్ట్రవ్యాప్తంగా దళారుల ఇష్టారాజ్యం

### సోయాబీన్ విత్తనాల బ్లాక్ మార్కెటింగ్



రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ఈ అవకాశాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరకు విక్రయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సోయాబీన్ విత్తనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర కేవలం రూ. 2,400 మాత్రమే కాగా... కొందరు వ్యాపారులు రైతుల నుంచి రూ. 2,600 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

- సహనం వందే, హైదరాబాద్

### విత్తనాల కొరత సాకుతో...

విత్తనాలు విక్రయించే వ్యాపారులు నగదు రూపంలో అదనంగా డబ్బులు వసూలు చేస్తూ, రసీదులో మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధరలనే నమోదు చేస్తున్నారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే విత్తనాల కొరత ఉందని సాకుగా చెబుతున్నారు. ఉదాహరణకు నిజామాబాద్ జిల్లాలో ఒక రైతు నాలుగు ఎకరాల భూమిలో పత్తి, సోయాబీన్, మిరప పంటలు సాగు చేసేందుకు విత్తనాలు అడిగితే, వ్యాపారి నాలుగు పత్తి విత్తన ప్యాకెట్లకు (ఒక్కొక్కటి 475 గ్రాములు) రూ. 900 చొప్పున రూ. 3,600, ఒక సోయాబీన్ సీడ్ సంచికి (30 కిలోలు) రూ. 2,400, మిరప విత్తనాలకు రూ. 900 బిల్లు వేశాడు. అయితే నగదు రూపంలో మాత్రం రూ. 600 అదనంగా తీసుకున్నాడు. రసీదులో వేసిన ధరల కంటే ఎక్కువ ఎందుకు తీసుకుంటున్నారని రైతు నిలదీయగా, పత్తి విత్తనాలపై ఒక్క ప్యాకెట్‌కు రూ. 100 అదనంగా ఇవ్వాల్సిందేనని, లేకుంటే విత్తనాలు ఇవ్వబోమని వ్యాపారి చెప్పడంతో చేసేది లేక రైతు ఆ అధిక ధరలకే విత్తనాలను కొనుగోలు చేశాడు. సగటున ఒక్క ప్యాకెట్‌పై రూ. 100 చొప్పున పత్తి, సోయాబీన్ విత్తనాలపై వసూలు చేస్తున్న దళారులు కోట్లాది రూపాయలను రైతుల నుంచి దోచుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### నిషేధిత బీటీ విత్తనాల దందా

పత్తి విత్తనాలకు సంబంధించి బ్రాండెడ్ హైబ్రీడ్ విత్తనాలైన బీటీ1, బీటీ2 రకాల కొరత ఉందని చెబుతూ, ఎంఆర్ పీ ధర రూ. 901 ఉన్నా అదనంగా రూ. 200 వరకు వసూలు చేస్తున్నారు. హైబ్రీడ్ విత్తనాల గురించి రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో వ్యాపారులు ఈ పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా, మరికొందరు వ్యాపారులు నిషేధించిన బీటీ3 పత్తి విత్తనాలను తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. బీటీ2 కంటే బీటీ3 విత్తనాలు సాగు చేస్తే 30 శాతం అధిక దిగుబడి వస్తుందని, దోమపోటు అసలు రాదని చెప్పి రూ. 600కే ప్యాకెట్ విత్తనాలను విడిగా విక్రయిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఖమ్మం తదితర జిల్లాల్లోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నిషేధిత గడ్డి మందులు, చీడల నివారణ కోసం వాడే ఆయిల్ ప్యాకెట్లను సైతం విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.